క్లుప్తంగా

పలాస కేంద్రంగా సేవలందించాలి



నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

కాశీబుగ్గ: పలాస కేంద్రంగా ఆర్టీవో సేవలు అందించాలని పలాస–కాశీబుగ్గ పట్టణం, రూరల్ ఆటో యూనియన్‌ల సభ్యులు కోరారు. ఈ మేరకు కాశీబుగ్గలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో పలాస కేంద్రంగా ఆర్టీవో సేవలు అందేవన్నారు. అయితే ఇటీవల ఎచ్చెర్లకు మార్చడంతో ఆటోలకు ఫిట్‌నెస్ చేయించడం కష్టతరంగా మారిందని వాపోయారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లవరాజు

సోంపేట: శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ లభిస్తుందని సోంపేట ఎస్‌ఐ లవరాజు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని గాంధీ మండపం జంక్షన్ వద్ద శక్తియాప్‌పై మహిళలకు గురువారం అవగాహన కల్పించారు. ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించి యాప్ ఉపయోగాలు తెలియజేశారు. మహిళలు, పిల్లలపై నేరాలను నివారించడానికి ఉపయోగపడుతుందన్నారు. పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రం సందర్శన



వైద్యులు, రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ కల్యాణ్‌బాబు

టెక్కలి రూరల్: ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని టెక్కలి జిల్లా ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని జిల్లా డీసీహెచ్‌ఎస్ ఎన్.కల్యాణ్ బాబు గురువారం సందర్శించారు. అనంతరం డయాలసిస్ చేయించుకుంటున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి రోజుకు ఎంతమందికి డయాలసిస్ చేస్తున్నారో వివరాలు పరిశీలించారు. ఆయనతో పాటు వైద్యులు ఆర్.రామకృష్ణ, లక్ష్మణరావు, మహారాజ్, హేమంత్ తదితరులు ఉన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి



విద్యార్థులతో డీఈవో తిరుమల చైతన్య

కాశీబుగ్గ: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని డీఈవో తిరుమల చైతన్య సూచించారు. పలాస మండలం రామకృష్ణాపురం గ్రామంలోని సత్యసాయి విద్యా విహార్‌లో కిడ్స్ కాన్వొకేషన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరావు, మల్లా రామేశ్వరం, ప్రీతి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

టెక్కలి: స్థానిక శంభానవీధిలోని షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలతో పాటు బాబాకు కాగడ హారతులు సమర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మంచినీటి ప్రణాళికలపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: ఉద్దానం ప్రాజెక్ట్ నుంచి మున్సిపాలిటీకి మంచినీటిని అందించే ప్రణాళికలపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అధ్యక్షతన సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో పర్యటించి తదనంతరం పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి నీటిని అందించే విషయం పరిశీలించాలన్నారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజినీర్ రాయల్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుగుణాకర్, డీఈఈ కనకరాజు, అసిస్టెంట్ ఇంజినీర్లు కిరణ్ కుమార్, మహేష్, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రుల గోడు.. వినరేం ఎవ్వరూ..!

- సమస్యల గండంలో ఇద్దివానిపాలేం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు



ఆటుపోట్ల సమయంలో గ్రామానికి సమీపంలోకి వచ్చిన సముద్రపు నీరు(ఫైల్)



శిథిలావస్థకు చేరుకున్న రక్షణ గోడ

కవిటి(ఇచ్ఛాపురం రూరల్): సుమారు నాలుగు వేల మంది జనాభా కలిగిన మత్స్యకార గ్రామం ఇద్దివానిపాలేం. ఎన్నికల సమయంలో ఈ గ్రామంపై రాజకీయ నాయకులకు వల్లమాలిన అభిమానం పుట్టుకొస్తుంది. తీరా ఎన్నికలైపోయాక గ్రామాన్ని పట్టించుకోవడమే మానేస్తుంటారు. నిజానికి ఈ గ్రామానికి జలగండం పొంచి ఉంది. వానొచ్చినా.. వరదొచ్చినా.. గ్రామస్తులకు భయమొస్తుంది. ఈ గ్రామం వద్ద గొనామారి గెడ్డ సముద్రంలో కలుస్తుంది. దీంతో వర్షాకాలంలో గ్రామ ప్రధాన రహదారి, గ్రామానికి ఉన్నటువంటి రక్షణ గోడ నిత్యం ప్రమాదపుటంచున నిలుస్తుంటాయి.

నేలమట్టం చేసిన తిత్లీ

2018లో వచ్చిన తిత్లీ తుఫాన్‌కు గ్రామ ప్రధాన రహదారితో పాటు రక్షణ గోడ నేలమట్టమైంది. దీంతో సముద్రంలో ఆటుపోట్లు, భారీ వరదలు వచ్చే సమయాల్లో మత్స్యకారుల బాధలు వర్ణనాతీతం. తుపాన్లు వచ్చే సమయాల్లో గ్రామస్తులకు బొరివంకలో అధికారులు పునరావాసం ఏర్పాటు చేస్తుంటారు. దివంగత మాజీ ఎంపీ కింజరాపు ఎర్రన్నాయుడు మంజూరు చేసిన ఎంపీ నిధులు రూ.14 లక్షలతో అప్పట్లో నిర్మించిన రక్షణ గోడ కొంతమేర పదేళ్ల క్రితమే నేట్టమైంది. అయితే తమ గ్రామంలోకి ఉప్పుటేరు నీరు రాకుండా రక్షణ గోడలు నిర్మించాలని, రోడ్డు వేయాలని అప్పటినుంచి గ్రామస్తులు కోరుతున్నా ఫలితం కనిపించడం లేదు. 2023లో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ స్పందించి జెడ్పీ నిధుల నుంచి రోడ్డు నిర్మాణానికి రూ.3 లక్షలు, రక్షణ గోడ కొంతమేర నిర్మాణానికి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేయడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే గతేడాది అక్టోబర్‌లో కురిసిన వర్షాలకు గొనామారి గెడ్డ ఉప్పొంగడంతో మరలా కొంతమేర రోడ్డు దెబ్బతింది. అందువలన ఇప్పటికైనా స్థానిక నాయకులు, అధికారులు స్పందించి గ్రామంలో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



జెడ్పీ నిధులతో నిర్మించిన రక్షణ గోడ



వరదలకు కొట్టుకుపోయిన గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి

నాయకులు స్పందించాలి



ఎన్నో ఏళ్లుగా మా గ్రామం అనునిత్యం జలగండాలు ఎదుర్కొంటోంది. భారీ వర్షాలు కురిసినా, వరదలు వచ్చినా ముందుగా నీటి ముంపునకు గురయ్యేది మా గ్రామమే. మేము నిత్యం నడిచే రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. రక్షణ గోడలు సైతం కూలిపోయాయి. ఎన్నికల సమయంలో నాయకులు వచ్చి హామీలు ఇస్తున్నారు. తర్వాత మర్చిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి రక్షణ గోడలు, రోడ్లు నిర్మించాలి.

– కె.సోమయ్య, మత్స్యకారుడు, ఇద్దివానిపాలేం

కంటిమీద కునుకుండదు



మా గ్రామం సముద్రానికి దగ్గరలో గొనామారి గెడ్డకు ఆనుకొని ఉంది. వరదలు, తుపాన్లు వస్తే మా మత్స్యకారులకు కంటిమీద కునుకు ఉండదు. ఏ క్షణంలో ఉప్పుటేరు పొంగి గ్రామంలోకి వస్తుందోనన్న ఆందోళన ఉంటుంది. రక్షణ గోడ శిథిలావస్థకు చేరుకుంది. ప్రభుత్వం స్పందించి రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటే మాకు ఎంతో మేలు చేసినవారవుతారు.

– జి.హనుమంతు, మత్స్యకార ప్రతినిధి, ఇద్దివానిపాలేం

విద్యార్థులు ఒత్తిడిని జయించాలి



సోంపేట: విద్యార్థులకు పరీక్షా కిట్లు అందజేస్తున్న దృశ్యం

సోంపేట: విద్యార్థులు ఒత్తిడి జయిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జింకిభద్ర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.వేణుగోపాలరావు అన్నారు. పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న 24 మంది విద్యార్థులకు పూర్వ విద్యార్థి రాయల శేషగిరి ఆర్థిక సాయంతో పరీక్షా కిట్లు గురువారం అందజేశారు. దాతలు ముందుకొచ్చి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కవిటి(ఇచ్ఛాపురం రూరల్): పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ముత్యాలపేట ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు అన్నారు. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవ్వనున్న నేపథ్యంలో విద్యార్థులకు హాల్ టిక్కెట్లు అందజేసి, స్థానిక శివాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆనింగి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చీడపీడలు అధిగమిస్తే దిగుబడులు



సాగులో ఉన్న టమాటా పంటను పరిశీలిస్తున్న అధికారులు

సోంపేట: టమాటా సాగులో చీడపీడలు అధిగమిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని పెద్దపేట ఉద్యానపంటల రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్త రాజశేఖర్ అన్నారు. మండలంలోని జింకిభద్ర గ్రామంలో కాయగూరల సాగుపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టమాటాను ఆశించే చీడపీడలపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యాన సహాయ సంచాలకురాలు శైలజ మాట్లాడుతూ.. ఉద్యానశాఖకు సంబంధించిన వివిధ పథకాల గురించి రైతులకు తెలియజేశారు. కూరగాయల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి మాధవీలత, వ్యవసాయ విస్తరణాధికారి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

కంచిలి: మండలంలోని కుంబరినౌగాం ఏజెన్సీ గ్రామంలో కాశీబుగ్గ అటవీ రేంజ్ అధికారి ఎ.మురళీకృష్ణ నాయుడు ఆదేశాల మేరకు అటవీ శాఖ అధికారులు గురువారం అడవిలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఎలా నివారించాలో సూచనలిచ్చారు. సమావేశంలో బీటు అధికారులు వెంకటేష్, లక్ష్మణరావు, దుర్గాదేవి, జోగారావు, భానుమూర్తి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డోలోత్సవానికి ఏర్పాట్లు

ఇచ్ఛాపురం టౌన్: పట్టణంలోని జగన్నాథ స్వామి ఆలయంలో పాల్గుణ పౌర్ణమి సందర్భంగా డోలోత్సవానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ మేనేజర్ బి.రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డోలోత్సవంలో భాగంగా రుక్మిణి, సత్యబామ సమేత వేణుగోపాల స్వామివారి దర్శన వేడుక శుక్రవారం జరగనుందన్నారు. ఆలయంలో నిత్యారాధన అనంతరం స్వామివారిని బెల్లుపడకాలనీలో ఉన్న డోలోమండపం వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని సన్యాసి నీలాపురం గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బసవల రాణి అనే మహిళకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మొదుగవలస గ్రామానికి చెందిన రాణి నర్సింగపల్లి వైపు నుంచి టెక్కలి వైపు గుర్తు తెలియన వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తుండగా, నీలాపురం సమీపంలో ఉన్న మలుపు వద్ద అమె ఒక్కసారిగా అదుపుతప్పి కింద పడిపోయింది. దీంతో అమెకు తీవ్రగాయాలయ్యాయి. అయితే గాయాలైన తర్వాత సదరు వాహన చోదకుడు మహిళను అక్కడ వదిలి వెళ్లిపోయాడు. ఇది గమనించిన స్థానికులు 108 సాయంతో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై టెక్కలి పోలీసులకు ఎటువంటి సమాచారం లేదని తెలిపారు.

సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణ నిర్వహిస్తున్న దృశ్యం

కంచిలి: మండలంలోని గొల్ల కంచిలి ప్రాథమిక పాఠశాల ఆవరణలో సరస్వతీ దేవి విగ్రహాన్ని ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబుల చేతులమీదుగా గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, హెచ్‌ఎం ఆనింగి లోకేష్, ఉపాధ్యాయురాలు దుంప సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ రద్దు

కాశీబుగ్గ: ప్రతీ శుక్రవారం కాశీబుగ్గ పోలీసుస్టేషన్ ఆవరణలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌ను ఈనెల 14వ తేదీన హోలీ సందర్భంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున కాశీబుగ్గ పరిసర ప్రాంత ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.

మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ

ఇచ్ఛాపురం రూరల్: అర్హులైన మహిళలకు ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి, వారికి కుట్టు మిషన్లు అందజేయడం జరుగుతుందని ఎంపీడీవో కె.రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, కాపు(బలిజ) కులాలకు చెందిన మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18 నుంచి 50 ఏళ్లలోపు వయస్సు గల మహిళలు అర్హులని, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతో గ్రామ సచివాలయం, ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 22 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

సంక్షిప్తంగా...

సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా

ఇచ్ఛాపురం రూరల్: సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతాల్లో జరిగే పేకాట వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిరంతరం దాడులు నిర్వహించి పూర్తిస్థాయిలో అరికట్టాలన్నారు. విస్తృతంగా వాహన తనిఖీల చేపట్టి మత్తు పదార్థాలు అక్రమ రవాణా అరికట్టే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళా హెల్ప్ డెస్క్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై సత్వరమే విచారణ జరిపి న్యాయం చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు, సీఐ మీసాల చిన్నంనాయుడు, ఎస్‌ఐ ఇ.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సోంపేట: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బారువ ఎస్‌ఐ హరిబాబు నాయుడు సూచించారు. మండలంలోని కొర్లాం గ్రామంలో గురువారం రాత్రి యువతతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు బానిసలు అయితే కలిగే నష్టాలపై యువతకు అవగాహన కల్పించారు. అలాగే ఆన్‌లైన్ మోసాలు గురించి వివరించారు. యువత సత్ప్రవర్తనతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. పోలీసు సిబ్బంది, యువత పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లు వేగవంతం

ఇచ్ఛాపురం టౌన్: మున్సిపాలిటీలో పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని కమిషనర్ ఎన్.రమేష్ స్పష్టం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పన్నులు వసూలు చేసే సిబ్బందితో సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటిపన్ను, నీటిపన్ను, ఖాలీజాగా పన్ను తదితర పన్నుల వసూళ్లు నెలాఖరులోగా పూర్తవ్వాలని ఆదేశించారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎంబీఏ విద్యార్థులకు బెంగుళూరుకు చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రశంసాపత్రాలను అందజేసింది. ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి బిజినెస్ ప్లాన్ చాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా ఆహారపు వినియోగంలో దయాక్యూర్ అనే నూతన ఆవిష్కరణ చేసిన పేపర్ ప్రజంటేషన్‌ను గుర్తించి, కళాశాలకు చెందిన విద్యార్థులు టంకాల యమున, బి.జయంత్, సాయికుమార్ జనా, టి.సంతోషిలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ మేరకు గురువారం కళాశాల డైరక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డి.విష్ణుమూర్తి, ఎంబీఏ హెచ్‌వోడీ బి.శివకుమార్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

పాఠశాలకు వితరణ



టెక్కలి మండలంలోని పాత నౌపడలో ఉన్న తలగాం ఎట్ నౌపడ ఆర్‌ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దేవి సీ ఫుడ్స్, బిగ్ హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో కంప్యూటర్లు, ప్రింటర్లను గురువారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో బిగ్ హెల్ప్ ప్రతినిధులు సి.వి.రాజా, జయకృష్ణ, ఆర్.రమేష్‌కుమార్, గ్రామ పెద్దలు పి.చిన్నయ్యరెడ్డి, ఎస్.కృష్ణారావు, బి.విద్యావతి, బి.లత, హెచ్.శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

– టెక్కలి

వాహనాల పార్కింగ్ ఎక్కడ..?



కవిటి మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలో శుక్రవారం జరగనున్న డోలోత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 30 వేల మంది వరకు యాత్రికులు, భక్తులు వచ్చే అవకాశం ఉంది. అయితే ఉత్సవానికి వచ్చే యాత్రికులు తమ వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. గతంలో బెజ్జిపుట్టుగ నుంచి బొరివంక సరిహద్దు వరకు ద్విచక్ర వాహనాలు, ఆటోలు వందల సంఖ్యలో నిలిపేందుకు రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు తొలగించేవారు. అయితే ఈ ఏడాది దేవాలయ కమిటీ గానీ, పంచాయతీ సిబ్బంది గానీ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో ఇబ్బందులు తప్పేలా లేవని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– కవిటి(ఇచ్ఛాపురం రూరల్)

నిత్యావసరాలు అందజేత



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని అంతరకుడ్డ గ్రామానికి చెందిన నౌగాపు ధర్మారావు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ఆయన పరిస్థితి తెలుసుకున్న పలాస కాష్యూ ల్యాండ్ లయన్స్ క్లబ్ సభ్యులు నిత్యావసర సరుకులను గురువారం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పల్లేటి రాజారావు, సభ్యులు బెల్లాల శ్రీరామగుప్తా, అట్టాడ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

– కాశీబుగ్గ

ప్రకృతి వ్యవసాయంతో మేలు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి ధనుంజయరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ జగన్‌మోహన్

కంచిలి: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల స్థాయి ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని సూచించారు. స్వయంశక్తి సంఘాల సభ్యులు పెరటి తోటల పెంపకం చేపట్టాలన్నారు. సమావేశంలో ఏపీఎం అప్పల నరసమ్మ, ఎన్‌ఎఫ్‌ఏ శివాజీ, మండల యాంకర్ టి.శివానందం, అభ్యుదయ రైతులు కప్ప గోపీనాథ్, గెడ్డం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి, ప్రకృతి వ్యవసాయాన్ని మండలంలో ఉద్యమంలా చేపట్టాలని వ్యవసాయశాఖ ఏడీఏ జగన్‌మోహన్ సూచించారు. మండల స్థాయి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై వ్యవసాయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వెలుగు అధికారులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో అత్యధిక ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ధనుంజయ్, ఎంపీడీవో ఈశ్వరమ్మ, వ్యవసాయాధికారి నరసింహమూర్తి, ఏపీఎం రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



వ్యాస రచన పోటీల విజేతలతో ఉపాధ్యాయులు

పలాస: మండలంలోని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సహజ రంగులతో ముందస్తు హోలీ వేడుకలు గురువారం నిర్వహించారు. పాఠశాలలోని జాతీయ హరిత క్లబ్, జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్‌ల ఆధ్వర్యంలో సహజ రంగుల ఆవశ్యకత, కృత్రిమ రంగుల వాడకం వల్ల కలిగే నష్టాలు గురించి ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం ఇదే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్వీ రమణరావు, ఎన్జీసీ క్లస్టర్ సమన్వయకర్త కొయ్యల శ్రీనివాసరావు తదితరుల పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



సావిత్రమ్మకు నగదు అందజేస్తున్న యువకులు

కవిటి(ఇచ్ఛాపురం రూరల్): మండలంలోని బల్లిపుట్టుగ గ్రామానికి చెందిన సావిత్రి దొళాయి గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న ఆవిడ వైద్య ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో స్థానిక యువత చేయూతనందించారు. తమ గ్రామ వాట్సాప్ గ్రూపు ద్వారా రూ.6 వేల నగదు సమకూర్చి గురువారం అందజేశారు.

ఫుడ్‌కోర్టులో చోరీ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి ఫుడ్ కోర్టు రెస్టారెంట్‌లో బుధవారం రాత్రి దొంగలుపడ్డారు. సీసీ కెమెరాలు, తాళాలు పగలుగొట్టి లోపలికి వెళ్లారు. అయితే కేవలం రూ.5 వేల నగదు మాత్రమే దొరకడంతో రెస్టారెంట్‌లో సామాన్లు ధ్వంసం చేశారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.